
సాక్షి బాపట్ల

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4513 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2140 క్యూసెక్కులు వదిలారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.5,500, మోడల్ ధర రూ.4,000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 521.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

ఎస్‌ఐ అభ్యర్థుల ఫిజికల్ పరీక్షలు రేపటికి వాయిదా



ఐజీ పాలరాజు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం జరగాల్సిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలను ఒక్క రోజు వాయిదా వేసినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం కారణంగా వాయిదా వేసినట్టు తెలిపారు. ఈ నెల 25న పరీక్షలు జరగాల్సిన వారికి సెప్టెంబర్ 16న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయని ఐజీ వివరించారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఎస్పీ



నగరంపాలెం: స్థానిక నగరంపాలెంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పరిశీలించారు. గ్రౌండ్‌లో ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు జరగనున్న దృష్ట్యా వర్షాల వేళల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు, డీఎస్పీలు చంద్రశేఖర్, బాలసుందరరావు, రేంజ్ ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

28న తెలుగు భాషపై చర్చావేదిక

నరసరావుపేట ఈస్ట్: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి 160వ జయంతిని పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 5 గంటలకు పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా రెండు వేల సంవత్సరాల తెలుగు భాషా వైభవం అనే అంశంపై చర్చావేదిక ఏర్పాటు చేసినట్లు వివరించారు. చర్చావేదికలో పలువురు భాషా పండితులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొంటారని తెలిపారు. తెలుగు భాషా సాహిత్యాభిమానులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో డ్రైవర్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 102 జిల్లా అధికారి సి.హెచ్.రాజేష్ చంద్ర తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, డ్రైవింగ్ లెసెన్స్, హెవీలైసెన్సు బ్యాడ్జి కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 9642677337 నంబరులో సంప్రదించాలన్నారు.

రవాణా వాహనాలకు స్పీడ్ గవర్నర్ తప్పనిసరి

నెహ్రూనగర్: రవాణా వాహనాల అధిక వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గవర్నర్ తప్పనిసరి అని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 8 మంది సీటింగ్ కెపాసిటీ వాహనాలకు గరిష్ఠంగా 80 కిలో మీటర్ల స్పీడ్ గవర్నర్, ఇక డంపర్లు, ట్యాంకర్లు, స్కూల్ బస్సులు, ప్రమాదకర వస్తువులను తీసుకువెళ్లే రవాణా వాహనాలు గంటకు 60 కిలోమీటర్ల స్పీడ్ గవర్నర్ అమర్చుకోవాలన్నారు. వాహన యాజమానులు వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పునరుద్ధరించే సమయంలో స్పీడ్ గవర్నర్ తప్పనిసరిగా అమర్చబడి ఉండాలన్నారు. స్పీడ్ గవర్నర్ లేకపోతే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వడం జరగదన్నారు.

కొండపల్లి బొమ్మల విక్రయ కేంద్రం ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ప్రభుత్వం స్ఫూర్తి పథకం ద్వారా కొండపల్లిలో నిర్మించిన కొండపల్లి బొమ్మల విక్రయ కేంద్రాన్ని ఎంపీ కేశినేని నాని, కలెక్టర్ ఢిల్లీరావు గురువారం ప్రారంభించారు. భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.172.50 కోట్లు కేటాయించింది, కళాకారుల కంట్రిబ్యూషన్, భవన నిర్మాణానికి ఎంపీ నాని తన నిధుల నుంచి రూ.55 లక్షలు మంజూరు చేయించారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థ నిపుణులు బొమ్మల తయారీలో కళాకారులకు అధునాతన శిక్షణ ఇవ్వడంతో పాటు బొమ్మల విక్రయానికి ఈ భవనం అనువుగా ఉంటుందని ఎంపీ తెలిపారు.

పాలన శుభవంతము



అద్దంకి మండలం నాగులపాడు రైతు భరోసా కేంద్రం



కొరిశపాడు మండలం కుర్రవానిపాలెంలో గ్రామ సచివాలయం

- శరవేగంగా భవన నిర్మాణాలు
- సెప్టెంబర్ 15 నాటికి పనులు పూర్తి
- ఇప్పటికే జరిగిన పనులకు బిల్లులు
- సచివాలయాల పనులు వేగవంతం
- రైతుభరోసా, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌ల పూర్తికి కసరత్తు
- రూ. 284.01 కోట్లతో నిర్మాణాలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు సమకూర్చేందుకు సర్కారు కృషి చేస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రథమ ప్రాధాన్యంగా చేపట్టిన ఈ నిర్మాణాలను వేగవంతం చేసింది. గతంలో వీటికి సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ చెల్లించిన సర్కారు మిగిలిన పనులకు ఎప్పటికప్పుడు చెల్లింపులు చేసేందుకు సిద్ధమైంది. దీంతో కాంట్రాక్టర్లు మరింత ఉత్సాహంతో పనులు వేగవంతం చేశారు. మరోవైపు పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణాల పూర్తికి చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 15 నాటికి అన్ని పనులూ పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

గ్రామస్థాయిలోనే సేవలకు అనువుగా..

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. పరిపాలన మొత్తం సచివాలయ వ్యవస్థ ద్వారా నడిపిస్తోంది. దీనికి అనుసంధానంగా రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. తాజాగా డిజిటల్ లైబ్రరీలను నెలకొల్పింది. ప్రజలకు అవసరమై అన్నిరకాల సేవలనూ గ్రామస్థాయి నుంచే అందిస్తోంది. దీంతో ఈ వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు ఆయా విభాగాలకు సొంత కార్యాలయాలను నిర్మించాలని నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాలో 401 గ్రామ సచివాలయాలకు, 315 రైతు భరోసా కేంద్రాలకు, 343 వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది.

రూ.158 కోట్లతో గ్రామసచివాలయ భవనాలు

సచివాలయాలకు సంబంధించి ఇప్పటివరకు 101 భవనాలు పూర్తికాగా 40 భవన నిర్మాణాలు పూర్తయి విద్యుత్ వైరింగ్ పనుల్లో ఉన్నాయి. 46 భవనాలు తుది దశలో ఉండగా 7 రూఫ్ దశలో, 26 మొదటిశ్లాబ్, 35 రెండోశ్లాబ్ దశలో ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో వచ్చే సెప్టెంబర్ 15 నాటికి అన్ని భవనాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.158 కోట్లతో ఈ భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది.

వేగంగా రైతుభరోసా భవనాల పనులు..

రైతు పక్షపాతిగా పేరుపొందిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల నుంచి సహాయ, సహకారాలు అందిస్తోంది. విత్తనాలు, ఎరువులు ఇస్తోంది. ఈ–క్రాప్ నమోదు చేస్తోంది. మొత్తంగా రైతులకు రైతుభరోసా కేంద్రాల నుంచే అన్నిరకాల సేవలు అందిస్తోంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 315 రైతుభరోసా కేంద్రాల భవనాలను నిర్మిస్తోంది. ఇప్పటివరకు 48 భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. తొమ్మిది విద్యుత్ ఏర్పాట్ల దశలో ఉన్నాయి. 30 భవనాలు తుది దశలో ఉన్నాయి. 26 భవనాలు శ్లాబ్ పూర్తి చేసుకున్నాయి. 9 భవనాలు రూఫ్ దశలో ఉండగా, 81 వివిధ దశల్లో ఉన్నాయి. 55 పునాదుల దశలో ఉన్నాయి. ఉన్న అన్ని భవనాలను సెప్టంబర్ 15 నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

> **శరవేగంగా ప్రభుత్వ భవనాల నిర్మాణం**
>
> జిల్లాలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సెప్టెంబర్ 15 నాటికి అసంపూర్తిగా ఉన్న భవనాల పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించింది. దీంతో పనులు వేగంగా జరగుతున్నాయి.
>
> – హరేరాకృష్ణ, ఎస్ఈ, పంచాయతీరాజ్, బాపట్ల

రూ.58.03 కోట్లతో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు

గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటికి శాశ్వత భవనాలను నిర్మిస్తోంది. జిల్లాలో రూ.58.03 కోట్లతో 343 భవన నిర్మాణ పనులను చేపట్టారు. ప్రస్తుతం 47 భవనాలు పూర్తికాగా 47 తుది దశలో ఉన్నాయి. మరో 8 భవనాలు విద్యుత్ సరఫరా ఏర్పాటు దశలో ఉన్నాయి. 34 భవనాలు శ్లాబ్ దశలో ఉండగా 15 భవనాలు రూఫ్ దశలో 72 వివిధ దశల్లో ఉండగా 62 పునాదుల దశల్లో ఉన్నాయి. 40 భవనాల పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ పనులన్నింటినీ సెప్టంబర్ 15 నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం. వీటితోపాటు ప్రభుత్వం జిల్లాకు 129 డిజిటల్ లైబ్రరీలను మంజూరుచేసింది. వీటినిర్మాణం కోసం రూ. 24.08 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే 7 డిజిటల్ లైబ్రరీ నిర్మాణ పనులు మొదలయ్యాయి.

వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షునిగా మోపిదేవి

- జిల్లా కమిటీలో ఇద్దరు ఉపాధ్యక్షులు
- నలుగురు ప్రధానకార్యదర్శులు
- ట్రెజరర్‌తోపాటు 8మంది కార్యదర్శులు
- 30 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లు
- 46 మందితో జిల్లా కొత్త కమిటీ



సాక్షి ప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు నియమితులయ్యారు. అధ్యక్షుడితో పాటు ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు, ట్రెజరర్, ఎనిమిది మంది కార్యదర్శులు, 30 మంది సభ్యులను పార్టీ నియమించింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం రాత్రి కొత్త కమిటీని ప్రకటించింది. ఇప్పటికే మోపిదేవి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. మరోమారు ఆయనను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షులుగా వేమూరుకు చెందిన ఎ.సుబ్బారావు, అద్దంకికి చెందిన జ్యోతి హనుమంతరావులను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా చీరాలకు చెందిన రొండా భరత్ రెడ్డి, అద్దంకికి చెందిన కె.అంజనీ ప్రసాదరెడ్డి, రేపల్లెకు చెందిన చెన్ను కోటేశ్వరరావు, పర్చూరుకు చెందిన షేక్ అబ్దుల్లాలను నియమించారు. ట్రెజరర్‌గా బాపట్లకు చెందిన కె.దేవేంద్రరాజును నియమించగా కార్యదర్శులుగా వేమూరుకు చెందిన ఎన్.నరేంద్రకుమార్, చీరాలకు చెందిన బండారు శివపార్వతి, ఎస్.సురేష్, బాపట్లకు చెందిన ఎం.పరమానందకుమార్, రేపల్లెకు చెందిన టి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, పర్చూరుకు చెందిన కల్లం వీరారెడ్డి, కోట హరిప్రసాద్‌ను నియమించారు. వీరితోపాటు మరో 30 మందిని జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపిక చేశారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు



చెక్కు అందిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు, కలెక్టర్ రంజిత్‌బాషా, కరణం బలరాం, హెనీక్రిస్టినా

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఇంటింటికీ మంచి జరగాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం నవరత్నాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తోందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. నవరత్నాలలో అర్హులై ఉండి గత ఆరునెలల్లో ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాలు అందని వారికి ద్వైవార్షిక నగదు జమ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్‌తోపాటు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, గుంటూరు జెడ్పీ చైర్‌పర్సన్, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ద్వైవార్షిక నగదు జమలో భాగంగా బాపట్ల జిల్లాలో 9,008 మందికి రూ.10.18 కోట్ల మేర ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. గతనెలలో నిర్వహించిన జగనన్న సురక్షలో 475 సచివాలయాలలో 4.76 లక్షల మందికి ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, శాసన మండలి సభ్యురాలు పోతుల సునీత, చీరాల శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, డీఆర్డీఏ పీడీ బి.అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3లో భాగస్వామి కావడం ఆనందం

- భారతీయుడిగా గర్విస్తున్నా
- భవిష్యత్తులో ఇతర గ్రహాలకూ వెళ్లే అవకాశం
- అంతరిక్ష శాస్త్రవేత్త, ఏటీఎల్ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌తో పావులూరి సుబ్బారావు

తెనాలి: చంద్రయాన్–3 విజయోత్సవాన్ని దేశంలోని సామాన్యులూ ఆస్వాదిస్తున్నారని తెనాలికి చెందిన ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త, హైదరాబాద్ కేంద్రంగా గల అనంత్ టెక్నాలజీస్ (ఏటీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు చెప్పారు. భారతదేశం అగ్రరాజ్యాల సరసన నిలిచిందని చెప్పుకోవటం కాదు.. మనదీ అగ్రదేశమేనన్న భావనకు రావాలని అభిప్రాయపడ్డారు. ఇస్రో లాంచ్ వెహికిల్స్, శాటిలైట్ మిషన్స్‌లో మూడు దశాబ్దాలుగా అనుబంధం కలిగిన ఏటీఎల్ తాజాగా చంద్రయాన్–3లోనూ భాగస్వామ్యం వహించింది. చంద్రయాన్–3 లాంచ్ వెహికిల్ (ఎల్‌వీఎం)లోనూ ఇందుకు కావాల్సిన ఆన్‌బోర్డ్ కంప్యూటర్స్, నావిగేషన్ సిస్టమ్, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, టెలిమెట్రి, పవర్ సిస్టమ్స్ తదితర ఏవియానిక్స్ ప్యాకేజెస్‌ను ఏటీఎల్ సమకూర్చింది. ఇప్పటివరకు 75 లాంచ్ వెహికిల్స్‌కు, 94 స్పేస్‌క్రాఫ్ట్‌కు జీరో లోపరహితమైన తయారీ మద్దతును ఇచ్చింది. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న డాక్టర్ సుబ్బారావు, గురువారం 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు.

ఆత్మ విశ్వాసం పెరిగింది

దేశానికి స్వాతంత్య్రం సిద్ధించినపుడు పొందిన ఆనందాన్ని సామాన్యులు ఎలా ఆస్వాదించారో తెలీదుగానీ తకుమించిన సంతోషంతో ఇప్పుడు పొంగిపోతున్నట్టు సుబ్బారావు చెప్పారు. స్వామి వివేకానంద చెప్పినట్టు మనలోని ఆత్మవిశ్వాసం, ఆత్మనిర్భరత, ధైర్యం, స్థైర్యం మరింతగా పెరిగాయన్నారు. చంద్రుడు తన కక్ష్యలో ఎలా ప్రయాణిస్తాడు అనేది పురాణాల్లోని చూశామని, ఇప్పుడు నేరుగా చూడగలగటం గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. ఇంతవరకు అమెరికా కూడా యత్నించని చంద్రుడి దక్షిణ ధ్రువంపై మన విక్రమ్ ల్యాండర్ కాలుమోపిందన్నారు. చంద్రుడిపై ఎక్కడ దిగాలనేది నిర్ణయం చేందుకు చంద్రయాన్–1 తోడ్పడిందని డాక్టర్ సుబ్బారావు గుర్తుచేశారు. చంద్రయాన్–2 ప్రయోగంలో చివరి నిమిషంలో సమస్య తలెత్తినా, ఆ ప్రయత్నం నుంచి సేకరించిన సమాచారంతో మరింత జాగ్రత్తలతో చేపట్టిన చంద్రయాన్–3 విజయవంతమైందని పేర్కొన్నారు. చంద్రుడిపై స్థావరం ఏర్పాటుకు మార్గం చిక్కిందన్నారు. దక్షిణ ధ్రువంలో నీరు కూడా ఉంటుందని ఇస్రో భావిస్తోందని చెబుతూ, ఆ ప్రయోగాలతోపాటు మరికొంచెం రిస్క్ చేయగలిగితే మిగిలిన గ్రహాలకు ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొన్నారు. తమ సంస్థకు తిరువనంతపురంలోని యూనిట్ ఫ్యాబ్రికేషన్, అసెంబ్లీ, టెస్టింగ్, అధునాతన కంప్యూటర్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ ప్యాకేజీలను లాంచింగ్ వెహికల్స్‌కు అందిస్తుండగా, బెంగళూరులోని ఫెసిలిటీ ఉపగ్రహాల తయారీకి అనువైనదిగా డాక్టర్ సుబ్బారావు వివరించారు. చంద్రయాన్–3లో భాగస్వామి కావటం భారతీయుడిగా గర్విస్తున్నానని చెప్పారు.

వేట సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- రక్షణ పరికరాలు వినియోగించాలి
- మత్స్యకారులకు ఎఫ్‌డీవో రాజ్‌కుమార్ సూచన



మత్స్య సాగుబడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎఫ్‌డీఓ రాజ్‌కుమార్

చీరాల టౌన్: సముద్రంలో వేట సాగించే మత్స్యకారులు రక్షణ పరికరాలను వినియోగిస్తూ అప్రతమత్తంగా ఉండాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీఓ) జమ్మి రాజ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని వాడరేవు గ్రామంలోని మత్స్యకారులకు మొదటి విడత 'వైఎస్సార్ మత్స్య సాగుబడి' కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలోని మత్స్యకారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలు, మత్స్యకార భరోసా పథకాల గురించి వివరించారు. ఎఫ్‌డీవో మాట్లాడుతూ మత్స్యకారులు రక్షణ పరికరాలు, లైఫ్ జాకెట్లు, వాకీటాకీ, జీపీఎస్ పరికరాల సాయంతో వేట సాగించాలన్నారు. కార్యక్రమంలో సాగర మిత్రలు, మత్స్యకార సొసైటీ నాయకులు సూరిరావు, అప్పారావు పాల్గొన్నారు.

ప్రజల కోసమే రక్షక్ వన భోజనశాల

- దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉపయోగం
- బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడి



రక్షక్ వన భోజనశాలలో భోజనం వడ్డిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: ప్రజా శ్రేయస్సు కోసమే రక్షక్ వన భోజనశాలను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో కొత్తగా ఏర్పాటుచేసిన రక్షక్ వన భోజనశాలను గురువారం ఎస్పీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ ప్రధాన కార్యాలయ అవరణలో పచ్చని చెట్ల నడుమ ఆహ్లాదకరంగా ఉండేలా ఈ భోజనశాలను ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, పోలీస్ సిబ్బంది నిత్యం జిల్లా పోలీస్ కార్యాలయానికి వస్తుంటారని, ఆ సమయంలో ఆహారం కావాలంటే పట్టణంలోకి వెళ్లాల్సి వస్తోందని వివరించారు. దీనిని గుర్తించి ప్రజలకు రుచికరమైన అల్పాహారం, భోజనం తక్కువ ధరకు అందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'రక్షక్ వన భోజనశాల' (వెల్ఫేర్ క్యాంటీన్)ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇది పూర్తిగా పోలీస్ సంక్షేమ నిధి ద్వారా నడుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏవోఎంఎఫ్ రహమాన్, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీలు టి.వెంకటేశ్వర్లు, ఎస్.ప్రసాద్‌రావు, టి.మురళీకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎ.వి.రమణ, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐ పి.బాలమురళీకృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్. మన్మథరావు, జిల్లాలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరం

బాపట్ల అర్బన్: జిల్లా వ్యాప్తంగా 96 సచివాలయాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ జరుగుతోంది. నామమాత్రపు రుసుముతో సేవలు అందిస్తున్నారు. శుక్రవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఆధార్‌కార్డులోని వివరాలను అందరూ అప్‌డేట్ చేసుకోవాలని కేంద్రం ఆదేశించడంతో శిబిరాలు చేపట్టారు. ఆధార్‌కార్డులోని పేరు, చిరునామా, ఫోన్ నంబర్ తదితర మార్పులు, చేర్పులు ఈ శిబిరాల్లో చేస్తారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆధార్ జిల్లా కో–ఆర్డినేటర్ బోరుగడ్డ అశోక్‌బాబు తెలిపారు.

పెళ్లి పీటలెక్కాల్సిన యువతి మృతి

- వైద్యం వికటించి తిరిగిరాని లోకాలకు..
- డాక్టర్ అవతారమెత్తిన మెడికల్ షాపు యజమానే కారణమని ఆరోపణలు



అంబులెన్స్‌లో హారిక మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



మార్టూరు: రెండురోజుల్లో పెళ్లి పీటలెక్కాల్సిన యువతి వైద్యం వికటించి మరణించిన ఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని కోలలపూడి గ్రామంలో గురువారం జరిగింది. ఓ మెడికల్ షాపు యజమాని చేసిన వైద్యం వికటించిందని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబీకులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా జే పంగులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన బెల్లంకొండ గోపమ్మ, గాలయ్య దంపతుల కుమార్తె హారిక (19)కి ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన యువకుడితో ఈనెల 26న శనివారం రాత్రి పెళ్లి చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. ఈ క్రమంలో హారిక తనకు నీరసంగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో గురువారం ఉదయం కోలలపూడి గ్రామంలో ఉన్న హారిక మేనమామలు వైద్యం చేయిస్తామని పిలిపించారు. మెడికల్ షాపు నిర్వహిస్తున్న సాదినేని వెంకటేశ్వరరావు ఓ యువతి సహాయంతో తన షాపు పక్కనే వైద్యం చేస్తున్నాడు. ఒంట్లో నలతగా ఉన్న హారికను వెంకటేశ్వరరావు వద్దకు బంధువులు పంపించడంతో మొదట ఒక సెలైన్ ఎక్కించారు. రెండో సెలైన్ ఎక్కించే క్రమంలో సెలైన్ బాటిల్‌లో వెంకటేశ్వరరావు ఓ ఇంజక్షన్ చేశాడు. ఆ తర్వాత కొంతసేపటికి హారికకు ఫిట్స్ రావడంతో బంధువులు కారులో మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అక్కడి నుంచి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా హారిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ హారికను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని గురువారం రాత్రి స్వగ్రామం ముప్పవరం తరలించారు. తెలిసీతెలియని వైద్యంతో రెండు రోజుల్లో పెళ్లి పీటలపై కూర్చోవాల్సిన హారికను శ్మశానానికి పంపారంటూ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదిలా ఉండగా.. హారిక మృతి విషయం బయటకు పొక్కకుండా కొందరు రాజీయత్నాలు ప్రారంభించడం గమనార్హం.

ఐఓసీ నూతన భవనానికి శంకుస్థాపన


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ బి.అనిల్‌కుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాంగణంలో గురువారం నూతన భవన శంకుస్థాపన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ బి. అనిల్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో వ్యాపార విస్తరణ ప్రతిపాదనలకు అనుగుణంగా, తాడేపల్లిలో నెట్ జీరో ఎనర్జీతో స్టీల్ పార్కింగ్ జీ+2 అంతస్తులతో రూ.22 కోట్ల వ్యయంతో 2.42 ఎకరాల్లో నూతన భవాన్ని నిర్మించబోతున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం కింద విజయవాడ, సికింద్రాబాద్, విశాఖ, తిరుపతి, వరంగల్‌లో డివిజన్ కార్యాలయాలు పనిచేస్తున్నాయని, విజయవాడ డివిజన్ కార్యాల పరిధిలో 8 ఉమ్మడి జిల్లాల్లో 542 రిటైల్ పెట్రోల్ బంక్‌లు, 15 జిల్లాల్లో 333 ఇండేన్ ఎల్‌పిజి పంపిణీదారులు, 37 లక్షల మంది వినియోగదారుల అవసరాలు తీరుస్తున్నామన్నారు. డివిజన్ కార్యాలయం ఇప్పటి వరకు విజయవాడ భారతీనగర్ భవనంలో కొనసాగుతూ వస్తోందన్నారు.

శుభప్రదం.. వరలక్ష్మి వ్రతం

● నేడు శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు ● కళకళలాడుతున్న పూలు, పండ్ల మార్కెట్లు


సత్తెనపల్లిలో పూలదుకాణం వద్ద సందడి

సత్తెనపల్లి: మాసాలన్నింటిలోనూ మంగళప్రదమైనది శ్రావణమాసం. ఈ మాసంలో శ్రావణలక్ష్మి సర్వాభరణాల అలంకరణలో తేజోవంతంగా భక్తులకు సాక్షాత్కరిస్తుంది. ముత్తైదువుల మనోభావాలకు, సంపద, సౌభాగ్యాలకు ఈ మాసం మహోదయం. అత్తవారిళ్లలో కొత్త కోడళ్ల కొంగొత్త ఆశలకు ఈ మాసం ఆశాజనకం. ఆషాఢం అడ్డంకులు అధిగమించాక కొత్త దంపతుల ఆనందప్రదమైన జీవితాలకు చంద్రోదయం. మహిళలకు శుభప్రదమైన శ్రావణమాసంలో మంగళ, శుక్రవారాల్లో ముత్తైదువులు ఇళ్లను పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. శ్రావణమాసానికి పదిహేను రోజుల ముందు నుంచే వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడతాయి.

నూతన వస్తువులు, వస్త్రాలతో సందడి

వివాహితలు విధిగా వారి స్తోమతను బట్టి కొత్త చీరలు కొని, శ్రావణ లక్ష్మికి చూపించి కట్టుకుంటారు. బంగారం ధర చుక్కల్ని తాకుతున్నా కొని శ్రావణలక్ష్మికి చూపించి ధరించడం అనాదిగా వస్తున్న ఆచారం. శ్రావణమాసం సందర్భంగా పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, మాచర్ల, వినుకొండ పట్టణ ప్రాంతాల్లో వస్త్ర, బంగారు దుకాణాలు మహిళలతో కళకళలాడుతున్నాయి.

మంగళగౌరీ వ్రతాలు

ఈ మాసంలో దేవాలయాలు, అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కళకళలాడుతుంటాయి. నిత్యం విశేష పూజలతోనూ, కుంకుమార్చనలతోనూ విరాజిల్లుతాయి. మంగళ,శుక్రవారాలు అమ్మవారికి మంగళగౌరీ వ్రతాలు, అభిషేకాలు, కుంకుమార్చనలు జరుగుతాయి.

పిండి వంటల ఘుమఘుమలు ..

ఈ మాసంలో ప్రతి ఇంట మంగళ, శుక్రవారాల్లో పిండి వంటల ఘుమఘుమలు నోరూరిస్తాయి. ఆర్థిక ఇబ్బందులు ఎలా ఉన్నా అనాదిగా వస్తున్న ఆచారాన్ని అంతా తప్పక పాటిస్తారు. ఇరుగు పొరుగు వారికి పంచుకుని సంప్రదాయాన్ని చాటుకుంటారు.

ధరలు పెంచేశారు..



సంప్రదాయానికి చిహ్నంగా జరుపుకునే పండగల్లో వరలక్ష్మి వత్రం ఒకటి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పండగలు చేసుకోవడం తప్పదు. మార్కెట్‌లో ఏ వస్తువు కొనాలన్నా విపరీతంగా రేట్లు పెంచి విక్రయిస్తున్నారు. దుస్తులు, లక్ష్మి కాసులు అన్నింటి ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

–పునులూరి లక్ష్మి, రఘురామ్‌నగర్

సంప్రదాయం ఉట్టిపడుతోంది



వరలక్ష్మి వ్రతం అంటేనే మహిళల పండగ. సంప్రదాయం ఉట్టిపడే ఈ పండుగ రోజుల్లో ప్రతి ఇల్లు ఒక దేవాలయంలా మెరిసి పోతుంది. మంగళ, శుక్రవారాల్లో మంగళ గౌరీవ్రతాలతో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోంది.

–చొప్పా శిరీష, నాగార్జుననగర్

రూ 5.47 లక్షలు విలువైన బయోస్టీమ్ లెంట్స్ స్వాధీనం



మోదుకూరు(వేమూరు): ప్రభుత్వం అనుమతి లేకుండా బయోస్టీమ్ లెంట్స్ తయారు చేసి అమ్మి రైతులను మోసం చేస్తున్న సంస్థలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఈశ్వరరావు తెలిపిన వివరాలు... చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన సోనీ అగ్రో ఇన్పుట్స్‌లో బయోస్టీమ్ లెంట్స్ తయారు చేస్తున్నట్లు సమాచారం తెలియడంతో తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అనుమతి లేకుండా 12 రకాల బయోస్టీమ్ లెంట్స్ తయారు చేస్తున్నారు. తొమ్మిది రకాలు కాలం చెల్లిన బయోస్టీమ్ లెంట్స్ గోడౌన్‌లో ఉన్నట్లు కనుగొన్నారు. బయోస్టీమ్ లెంట్స్ తయారీకి ఉపయోగించే 264 కిలోల ముడి సరుకులు, తయారీ, ప్యాకింగ్, సీలింగ్ మెటీరియల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 5.47 లక్షలు ఉంటుందని తెలిపారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అగ్రికల్చరల్ అధికారి జె వాసంతి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో వంద శాతం సీట్ల భర్తీ


భారీ కేక్ కట్ చేస్తున్న కళాశాల యాజమాన్యం

వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఏపీ ఈఏపీసెట్- 2023 కన్వీనర్ కోటాల్లో వంద శాతం సీట్లు భర్తీ పూర్తయినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతులు లక్ష్మణరావు తెలిపారు. గురువారం కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ 2001లో మూడు కోర్సులతో 180 సీట్లతో కళాశాలను ఫౌండర్ చైర్మన్ వనమా వెంకటేశ్వరరావు స్థాపించారన్నారు. న్యూఢిల్లీ ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీచే శాశ్వత గుర్తింపు పొందిందన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారిచే రెండు ఎఫ్–12 బీ గుర్తింపు, రాష్ట్ర ప్రభుత్వంచే ఏ గ్రేడ్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌చే శాశ్వత గుర్తింపు లభించినట్లు చెప్పారు. ప్రస్తుతం బీటెక్‌లో తొమ్మిది కోర్సులతో, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్ కోర్సులతోపాటు బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సులతో అటానమస్ హోదా సాధించిందన్నారు. అత్యాతుధునిక సదుపాయాలతోపాటు 1500 కంప్యూటర్లతో కూడిన లాబోరేటరీలతోపాటు 200 ఎంబీపీఎస్ స్పీడ్ కలిగిన ఇంటర్‌నెంట్ సౌకర్యం ఉందన్నారు. 38 మంది విద్యార్థులు ప్రతిభా అవార్డులు పొంది రాష్ట్ర ప్రభుత్వంలో నాలుగో స్థానంలో నిలిచిన కళాశాలగా ఉందన్నారు. 2016లో సెంటర్ ఫర్ సీఐజీఎస్ సెంటర్ ఫర్ జీఎన్ఎస్ ఇస్రో స్టడీస్ స్థాపించి స్పేస్ టెక్నాలజీలతో ఇస్రో మిషన్‌లో పాలు పంచుకుంటుందని తెలిపారు. బాపట్ల జిల్లాలో వంద శాతం సీట్లు భర్తీ సాధించిన కళాశాల సెయింట్ ఆన్స్ అన్నారు. అనంతరం భారీ కేక్‌కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కళాశాల యాజమాన్యంపై నమ్మకం ఉంచి తమ పిల్లలను కళాశాల్లో చేర్పించినందుకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి అభినందనలు తెలిపారు.

భర్తను హత్య చేసిన భార్య, ప్రియుడు, మరొకరు అరెస్ట్


ముగ్గురు నిందితులతో సీఐ శోభన్‌బాబు, పోలీస్ సిబ్బంది

సత్తెనపల్లి: భర్తను హత్య చేసిన భార్య, ప్రియుడు, సహకరించిన మరో వ్యక్తిని పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని రెండో వార్డు రంగా కాలనీకి చెందిన ఎఫ్‌సీఐ ముఠా కార్మికుడు ఎబ్బిలి వెంకటేశ్వర్లు (32) ఇంట్లో నిద్రిస్తుండగా ఈనెల 18న అర్ధరాత్రి హత్య గావింప బడ్డాడు. భార్య గౌరీ, ఆమె ప్రియుడు కారు డ్రైవర్ పల్లపు సుబ్రహ్మణ్యంలతోపాటు చల్లా వెంకటస్వామిలను అరెస్ట్ చేసి విచారించగా ముగ్గురు కలిసి గొంతు నులిమి హత్య చేసినట్లు నిర్ధారణ అయ్యింది. గ్రామ రెవెన్యూ అధికారి వద్ద నుంచి పట్టణ సీఐ యు.శోభన్‌బాబు, సిబ్బందితో కలిసి ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఐదు రోజుల్లోనే హత్య కేసును చేదించి నిందితులను పట్టుకున్న పట్టణ సీఐ శోభన్‌బాబు, పోలీస్ సిబ్బందిని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ ప్రత్యేకంగా అభినందించారు.

యార్డులో 32,242 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 30,853 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 32,242 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.24,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి 25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,582 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కేజీబీవీలో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

బాపట్లఅర్బన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ఖాళీగా ఉన్న కుక్స్, అసిస్టెంట్ కుక్స్, వాచ్ ఉమెన్, స్వీపర్ పోస్టులకు రోజువారి కింద 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు నెలలు, అవుట్‌సోర్సింగ్ కింద నాన్ టీచింగ్ స్టాఫ్ రిక్రూట్‌మెంట్ చేసే వరకు నెలకు రూ.7వేలు జీతంతో పనిచేసేందుకు జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు పోస్టులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎం.చారులత గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు బాపట్లలో సమగ్ర శిక్ష కార్యాలయంలో కార్యాలయ పనివేళల్లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు 7వ తరగతి మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ, క్యాస్ట్, రెసిడెంట్ సర్టిఫికెట్లు ఒరిజినల్స్‌తోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుండి 42 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 47 సంవత్సరాలు, దివ్యాంగుల అభ్యర్థులకు 52 సంవత్సరాల వయస్సు కలిగి ఉండవచ్చన్నారు. దరఖాస్తులు జిల్లాలోని అన్ని కేజీబీవీ మండల విద్యా వనరుల కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు.

బీడీఎస్ విద్యార్థిని అనుమానాస్పద మృతి


నెట్టెం ప్రసన్న(ఫైల్)

ఉంగుటూరు: గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో బీడీఎస్ విద్యార్థిని హాస్టల్ గదిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన నెట్టెం ప్రసన్న(26) కళాశాలలో బీడీఎస్ 3వ సంవత్సరం పీజీ చదువుతోంది. ఇటీవల ప్రసన్న కాలుకు ఫ్యాక్చర్ అయింది. ప్రస్తుతం ఆమే కోలుకోవడంతో రెండు రోజులుగా నెమ్మదిగా కళాశాలకు వెళుతోంది. గురువారం కళాశాలకు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉంది. సాయంత్రం క్లీనింగ్ సిబ్బంది గదులను శుభ్రం చేసే క్రమంలో ఆ విద్యార్థిని ఉన్న గది తలుపులు ఎంతసేపటికి తీయకపోవడంతో యాజమాన్యనికి తెలిపారు. వారు తలుపులు తెరచి చూస్తే ఫ్యానుకు ఉరి వేసుకుని వేళాడుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీఎస్‌ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు విజయవాడ విద్యాధరపురంలోని జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, భీమవరం జిల్లాల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీలోపు www.apprenticeshipindia.gov.in వెబ్ సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా జిల్లాల వారీగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఐటీఐ మార్క్స్, సీనియారిటీ ప్రకారం ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం www.apsrtc.ap. gov.in వెబ్‌సైట్‌లోని రిక్రూట్‌మెంట్స్‌లో విభాగంలో చూడవచ్చని తెలిపారు.

నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షల దరఖాస్తులకు శుక్రవారంతో గడువు ముగుస్తుందని మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపల్ ఎన్ నరసింహారావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయంలో మొత్తం 80 సీట్లు ఉన్నాయన్నారు. ఎలాంటి ఫీజులు లేకుండా 6–12 వరకు సీబీఎస్‌ఈ విధానంలో ఉచిత విద్యతోపాటు వసతి కల్పన ఉంటుందన్నారు. 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ అర్హత పరీక్షలకు ఇప్పటికే 3,155 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రానికి మరిన్ని అర్జీలు వచ్చే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకోని వారు ఎవరైనా ఉంటే వెంటనే చేసుకోవాలని కోరారు. జేఎన్‌వీఎస్‌టీ -2024 పరీక్షను వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉండి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 2022–23 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో ఐదో తరగతి చదువుతూ ఉండాలన్నారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం



కారంచేడు: కొమ్మమూరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. గురువారం మండలంలోని కారంచేడు–స్వర్ణ గ్రామాల మధ్యన గుర్తు పట్టడానికి కూడా వీలులేని విధంగా ఉన్న మృతదేహం ఉన్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కారంచేడు ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలం వద్దకు వెళ్లి నీటిలో ఉన్న మృతదేహాన్ని అతికష్టం మీద బయటకు తీయించారు. ఎస్ఐ వివరాల మేరకు.. మృతదేహం వయస్సు సుమారు 45–50 సంవత్సరాలు ఉంటుందని, ఎగువ ప్రాంతంలో ఎక్కడో కాలుజారి పడిపోవడమో, ఆత్మహత్య చేసుకోవడమో, ఎవరైనా చంపి కాలువలో పడేయడమో చేసి ఉంటారని అనుమానిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెంది సుమారు వారం వరకు అయ్యి ఉండవచ్చన్నారు. పై ప్రాంతంలో ఎక్కడైనా మిస్సింగ్ కేసులు నమోదు అయ్యాయోమోనన్న సమాచారం కోసం బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పలు పోలీ స్టేషన్‌లకు సమాచారం అందించామన్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు.

చట్ట వ్యతిరేకులపై కఠినంగా వ్యవహరిస్తాం


సీఐతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో గురువారం జరిగిన నేర సమీక్ష జరిగింది. దీర్ఘకాల పెండింగ్ కేసులు, 2018 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లల్లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోక్సో యాక్ట్, మహిళలు, రోడ్డు ప్రమాదాలు, అదృశ్యాలు, చోరీల కేసుల దర్యాప్తు వేగవంతంగా చేపట్టాలని, వీలైనంత త్వరగా కేసులను చేధించాలని ఆదేశించారు. ఫిర్యాదిదారులతో మర్యాదగా మెలగాలన్నారు. వారి సమస్యలు ఏవైనా ఉన్నట్లయితే చట్టపరిధిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాధలను చెప్పుకునేందుకు వచ్చే అర్జీదారులతో ఏ ఒక్కరూ అనుచితంగా మాట్లాడవద్దని చెప్పారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలు అమలయ్యేలా చూడాలన్నారు. గంజాయి రవాణా, క్రయ విక్రయాలను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జైళ్ల నుంచి విడుదలైన పాత నేరస్తులపై నిఘాతోపాటు ఎప్పటికప్పుడు వారి కదలికలు గమనించాలని సూచించారు. దొంగతనాలు చేధించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలన్నారు. నేరస్తులు వదిలేసిన ఆధారాలు, సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా చోరులను అరెస్ట్ చేసి, దొంగలించిన సొత్తు పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారులు అదృశ్యమైనట్లు ఫిర్యాదులు వచ్చిన వెంటనే అలసత్వం చూపించవద్దన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని చెప్పారు. అనుమానిత వ్యక్తులు తారసపడితే పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఏఎస్పీలు ఎస్.షెల్కే (గుంటూరు తూర్పు), శ్రీనివాసరావు (క్రైం), కె.శ్రీనివాసరావు (ఎల్/ఓ) డీఎస్. మహేష్ (ఎస్ ఈబీ), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు మహబూబ్‌బాషా(దక్షిణ), పోతురాజు (తూళ్లూరు), రాంబాబు(ఉత్తర), ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు పశ్చిమ), జనార్ధన్‌రావు (తెనాలి), బాలసుందరరావు (ట్రాఫిక్), కేసీహెచ్. రామారావు (దిశ), శ్రీనివాస్‌రావు (డీసీఆర్‌బీ), విజయశేఖర్ (ఎస్సీ, ఎస్టీ), చంద్రశేఖర్ రావు (ఏఆర్) తదితరులు పాల్గొన్నారు.